విజ్ఞానం.. వినోదం

- పలు అంశాల్లో చిన్నారులను తీర్చిదిద్దుతున్న వేసవి శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న బాలబాలికలు


పెయింటింగులో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (లైబ్రరీ)

మురళీనగర్‌లోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచుతున్నాయి. గత 15 రోజులుగా జరుగుతున్న శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మురళీనగర్ గ్రంథాలయంలో ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు.

మురళీనగర్: మురళీనగర్ గ్రంథాలయంలో ప్రతి రోజు ఒక ప్రత్యేక అంశంలో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జనకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచి వారిలో పఠనాశక్తి కలిగిస్తున్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం నేర్పిస్తున్నారు. మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంతాల నుంచి బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.


చెర్రీ బ్లాజమ్ పెయింటింగును ప్రదర్శిస్తున్న చిన్నారులు (లైబ్రరీ)

వినోదాత్మక క్రీడలు

విద్యార్థుల్లో మానసిక, శారీర అభివృద్ధితో పాటు వినోదాన్ని పంచే క్రీడలు ఆడిస్తున్నారు. చెస్, క్యారమ్స్, సూడోకు, మ్యూజికల్ చైర్స్, కప్ గేమ్ వంటి ఇండోర్ క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నారు. చిన్నారులకు ఒక అంశాన్ని ఇచ్చి మాట్లాడించడం, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. చిత్రలేఖనంలో ప్రవేశానికి సంబంధించి ప్రాథమిక అంశాలు నేర్పించారు. గ్లాస్, పేపర్, పాట్ పెయింటింగులో మెలకువలు నేర్పుతున్నారు.


చెస్ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (వాకర్స్ పార్కు)

పలు అంశాల్లో శిక్షణ

మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. డబ్బీరు రోహిత్, ఎస్‌వీఆర్ నాయుడు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మైండ్ మేనేజిమెంటుపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఈ పార్కులో విద్యార్థులకు చదరంగం క్రీడపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సనపల ఉమాపతి విద్యార్థులకు చదరంగం ఆడే విధానాన్ని, ఎత్తులు, పైఎత్తులు వేసే పద్ధతులను నేర్పిస్తున్నారు. దీనికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రోజూ కనీసం 40 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కేకే కాలనీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడే వేసవి శిక్షణ శిబిరం జరుగుతోంది. బాక్సింగ్, వాలీబాల్, క్యారమ్స్ ఆటల్లో విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు.

ఏకాగ్రత పెరుగుతుంది



చిత్రలేఖనం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. స్థిరమైన ఆలోచనలు వస్తాయి. దస్తూరి మెరుగుపడుతుంది. చదువులో ముందంజలో ఉంటాం. కేవలం చదువే కాకుండా ఇతర రంగాల్లో రాణించాలనేది నా ఆశయం. పుస్తక పఠం అంటే చాలా ఇష్టం. కథల పుస్తకాలు ఎక్కువగా చదువుతాను.

– అన్వికాశెట్టి, 7వ తరగతి

చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం



ఈ వేసవిలో చిత్రలేఖనంలో పట్టు సాధించాలని మురళీనగర్ లైబ్రరీలో శిక్షణ పొందుతున్నాను. పాట్ పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ పొందాను. నేను స్వయంగా చిత్రాలు గీయగలను. పాట్‌లను అందంగా తీర్చిదిద్ది వాటిని అలంకరణ వస్తువులుగా వాడుకోవచ్చు.

– ఎ.జనీష్, 6వ తరగతి.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కౌన్సెలింగ్

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి సర్వం సిద్ధంగా ఉన్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగులో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

ఇవి తీసుకురావాలి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ప్రాసెసింగు ఫీజు రసీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో (ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ), 4–10 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), 01.01.2020 నాడు లేదా తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు వారికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.

ర్యాంకులవారీగా కౌన్సెలింగ్ వివరాలు:

కేంద్రం	మే29	మే30	మే31
జూన్1	జూన్2	జూన్3	జూన్4
జూన్5			

కెమికల్ ఇంజినీరింగు కాలేజీ, కంచర పాలెం

1నుంచి 6000	12001 నుంచి 19500	27001 నుంచి 35000	43001 నుంచి 51000
59001 నుంచి 67000	75001 నుంచి 83500	92001 నుంచి 100000	108001 నుంచి 116000


పాలిటెక్నిక్ విద్యార్థులు

పాలిటెక్నిక్ కాలేజీ, కంచర పాలెం

6001 నుంచి 12000, 19501 నుంచి 27000, 35001 నుంచి 43000, 51001 నుంచి 59000, 67001 నుంచి 75000, 83501 నుంచి 92000, 100001 నుంచి 108000, 116001 నుంచి చివరి ర్యాంకు

పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి

1 నుంచి 12000	12001 నుంచి 27000
27001 నుంచి 43000	43001 నుంచి 59000
59001 నుంచి 75000	75001 నుంచి 92000
92001 నుంచి 108000	108001 నుంచి చివరి ర్యాంకు

ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు జూన్ 2 నుంచి 5 వరకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలి.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: శ్రీ యశోద కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో అమెరికన్ ఆసుపత్రి సహకారంతో సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ బి.శ్రీకాంత్, ఫిజీషియన్లు జాన్ సూరజ్, సుగుణ, అంకాలజిస్ట్ రవీంద్రకుమార్, పీడియాట్రిషన్ సంతోష్, సంఘం సభ్యులు ముద్దాడ ఎల్లాజి, బీసపు శ్రీను, పిల్లా మోహన్, పల్లా పాపారావు, నాయుడు మాస్టర్, జోగ శ్రీను, ముద్దాడ శంకర్, పల్లా రాము, ఒమ్మి చిన్న, ఉప్పిలి అప్పన్న పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల ఎలా మెలగుతున్నారని తెలుసుకున్నారు. కొట్లాటలు, తగాదాల్లో తలదూర్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గోతులు


ద్వారకానగర్ 6వలైన్ వద్ద ప్రమాదకరంగా గోతులు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు ఆరవలైన్ శంకరమఠం సమీపంలో ప్రధాన రహదారి గోతులతో ప్రమాదకరంగా తయారైంది. వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గోతులతో నిండిన ఈ రోడ్డులో రాత్రిపూట వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు


షాపులు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా ఉన్న తోపుడు బళ్లను తొలగించారు. ఈ మేరకు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం మెట్టు నుండి ఊర్వశి జంక్షన్ వరకు బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వ్యాపారాలు నిర్వహిస్తున్న తోపుడు బళ్లు, బడ్డీలను తొలగించారు. ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడిచేందుకు వీలుగా చేసి, వ్యాపారులకు అవగాహన కలిగించారు.

వలంటీర్లు వారధులు

- పురస్కారాల ప్రదాన వేడుకలో నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు

మర్రిపాలెం:ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి వలంటీర్ల వ్యవస్థ అని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయ, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 54వ వార్డు జ్యోతినగర్ సచివాలయం వద్ద జోన్–5 ఆధ్వర్యంలో 53,54 వార్డులకు సంబంధించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవ వజ్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్లను సత్కరించి అవార్డులు ప్రదానం చేసి సర్టిఫికెట్లు అందజేశారు. నిరుపేదలకు తక్షణ సాయం అందే విధంగా ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిట చేరే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, స్టాండింగ్ కమిటీ మెంబర్, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్‌అలీ, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని ఈశ్వర్‌రావు, 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, కేపీ రత్నాకర్, మాజీ కార్పొరేటర్ కె.వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, జోన్–5 ఏపీడీ శైలజ, 53, 54 వార్డు నాయకులు చిరంజీవి, షేక్‌బాబ్జి, హనుమంతు, రమణమ్మ, నబి, సోమేష్, శ్రీను, దిలీప్, సుజాత, భాను, నాగరాజు, రమేష్, సంపత్, అచ్యుతరావు, జగదీష్, రిజ్వాన్, సచివాలయం కన్వీనర్లు, సిబ్బంది, ఆర్పీలు, వలంటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్లను సత్కరిస్తున్న కేకే రాజు తదితరులు

బాలుడు అదృశ్యం



మర్రిపాలెం:ం: కంచరపాలెం పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. కంచరపాలెం 5వ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీసాల తేజ (15) తల్లిదండ్రులతో కలిసి గొల్ల కంచరపాలెంలో నివసిస్తున్నాడు. ఈ నెల 24 ఉదయం 7.30 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్ళి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి మీసాల శ్రీనివాసరావు ఆదివారం కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్ విజయ్ కుమార్ నేతృత్వంలో ఏఎస్ఐ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు


క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 25 మంది పాల్గొన్నారు. విజేతలకు చిరు కానుకలు అందించారు. అనంతరం కథల పుస్తక పఠనం నిర్వహించారు.

చిల్డ్రన్ పార్కు ప్రారంభం

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో అభివృద్ధి చేసిన చిల్డ్రన్ పార్కు ప్రారంభోత్సవం వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధి నిధులు రూ.7 లక్షల వ్యయంతో పిల్లల పార్కును అధునీకీకరించామన్నారు. నిర్వహణ లేక కళా విహీనమైన పార్కు కార్పొరేటర్ ఉషశ్రీ చొరవతో చక్కగా రూపొందిందన్నారు. పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వద్ద మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, ఏఈ రమణమ్మ, జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్, పారుపల్లి రవి, ఎస్.కుమార్, రమణ, నరేష్, రమణబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, శ్రీనివాసనగర్ రెసిడెన్షియల్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పిల్లల పార్కును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఉషశ్రీ

సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం

మురళీనగర్: సకాలంలో గుర్తించి చికిత్స పొందినట్లయితే క్యాన్సర్‌ను పూర్తిగా నివారించవచ్చని అపోలో ఆస్పత్రి అంకాలజిస్టు డాక్టర్ వి.ప్రదీప్ తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ప్రాంగణంలో అపోలో ఆస్పత్రి సౌజన్యంతో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్ నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళల్లో గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో ఎక్కువగా ప్రోస్టేట్, లివర్, గొంతు క్యాన్సర్ వస్తాయన్నారు. సకాలంలో గుర్తించి సరైన జాగ్రత్తలు తీసుకుంటే 60 నుంచి 70 శాతం వరకు కేసుల్లో క్యాన్సర్ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. ధూమపానం, ఆల్కహాల్ తీసుకోవడం, ఖైనీలు, గుట్కాలు తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మంచి ఆహారపు అలవాట్ల వల్ల క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని వివరించారు. పీచు పదార్థాలు తీసుకోవడం, పండ్లు, తాజా కూగాయలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు తాగాలన్నారు. క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. శిబిరంలో డాక్టర్ ప్రదీప్‌తో పాటు డాక్టర్ జి.గణేష్ పాల్గొని 132 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, జాలీ వాకర్, ఎస్.ప్రకాశరావు, కోశాధికారి జె.కూర్మారావు, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, పి.సూర్యనారాయణ మాస్టర్, అపోలో మార్కెటింగ్ మేనేజర్లు జి.రాంబాబు, పి.చంద్రశేఖర్ పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు ప్రదీప్, గణేష్

తూర్పు కాపు నూతన జేఏసీ ఏర్పాటు

సీతమ్మధార : తూర్పు కాపు కులాన్ని చిన్నచూపు చూస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హెచ్చరించారు. ఆశీలమెట్టలో జరిగిన రాష్ట్ర తూర్పు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తూర్పు కాపు రిజర్వేషన్ల సాధనకు పలుమార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 36 మందితో తూర్పు కాపు జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర జేసీ ఛైర్మన్‌గా గిరగా అప్పలస్వామి, కో ఛైర్మన్‌గా అన్నెపు రామకృష్ణ నాయుడు, గౌరవ ఛైర్మన్‌గా పైలా శ్రీనివాసరావు, వర్కింగ్ ఛైర్మన్లుగా బబ్బాది ఫకీర్‌నాయుడు, పతివాడ కృష్ణవేణి, చీఫ్ సెక్రటరీలుగా రాయి శ్రీనుబాబు, ఈ.శ్రీనివాసరావు, కె.అచ్చెంనాయుడు, ఎం.గురునాయుడు, కోశాధికారిగా బెల్లాన సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల అప్పల సూరినాయుడు, ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, యువజన విభాగం రాష్ట్ర సహాధ్యక్షుడు శ్రీనుబాబు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బైపతి జయలక్ష్మి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న తూర్పు కాపు జేఏసీ నాయకులు

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి

సీతంపేట: నట సార్వభౌమ నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలు జీవీఎంసీ 26వ వార్డులో ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి సంఘం ఆఫీస్ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి పెదన లక్ష్మణ, కన్వీనర్లు రహీం, భాను, ఫాతిమ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

50వ వార్డులో..

మురళీనగర్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను 50వ వార్డులో వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్లా కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షుడు బొండల మదన్‌మోహన్, సనపల రామచంద్రరావు, ఎండా ధాత్రి, చక్రి, పప్పల గౌరి, అప్పలనాయుడు, శేఖర్, పెంటకోట శ్రీను, పెంటకోట వెంకట్రావు, రాము, చిన్నారావు, సంబాళ్ల సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రావణి

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎన్టీఆర్ డూప్‌గా రాజ కుమార్ యాదవ్, గాంధీ కాకర్ల పాడిన గజల్స్, మేజిక్ బాషా ఇంద్రజాల ప్రదర్శన, నీరజా సుబ్రహ్మణ్యం, భేరి రాధారాణి, ఆర్.నాగరాజు పట్నాయక్ బృందాలు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ వ్యవస్థాపకుడు పి.ఎ. భాస్కరరావు, సంఘ సేవకులు కంచర్ల అచ్యుతరావు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సినీ దర్శకుడు యాద్‌కుమార్ తదితరులు పాల్గొనగా.. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ అధినేత నాగరాజు పట్నాయక్ చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.


సత్కారం అందుకున్న కళాకారులతో అతిథులు

'నాడు నేడు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సీతంపేట: డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన 'నాడు నేడు' పుస్తకావిష్కరణ సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోమాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రచయితల పాత్ర గొప్పదని ప్రశంసించారు. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం కావాలన్నారు. 1947 నుంచి 2022 వరకు సాహిత్య, కళా రంగాలకు నండూరి చేసిన సేవలను పుస్తకంలో అద్భుతంగా పొందుపర్చారన్నారు. కవితల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య కె.మలయవాసిని, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించాలి

సీతమ్మధార : జూలై 4న నిర్వహించనున్న అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ క్షత్రియ ఫెడరేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ వెంకటపతిరాజు అన్నారు. ఆదివారం సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపంలో వేడుకల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వానం అందించేందుకు ఫెడరేషన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సెక్రటరీ డీఎస్ఎన్ రాజు, క్షత్రియ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ డి. తిరుపతిరాజు, సెక్రటరీ డీఎస్‌పీ వర్మ, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకేరాజు, ఉత్తర మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఎంఎల్‌సీలు పి.రఘువర్మ, రఘురాజు, మాజీ ఎంఎల్‌సీ సూర్యనారాయణరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటపతిరాజు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

మురళీనగర్: వేసవి వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు మానవసేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వెంకటరమణమూర్తి ప్రారంభించారు. బాటసారులు, కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, ఉపాధ్యక్షుడు ఎం.కోదండం, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, కోశాధికారి కేవీ వర్మ, సంయుక్త కార్యదర్శి పి.సంతోష్ కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఉప కోశాధికారి పి.వెంకటరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొని సహకరించారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటరమణమూర్తి

నిరంతర వైద్య విద్యతో చక్కటి నైపుణ్యం

మహారాణిపేట : నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా ఆధునిక పద్ధతులు తెలుసుకోవడానికి వీలు కలుగుతుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కేజీహెచ్ ప్రసూతి విభాగం, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో ఆదివారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బుచ్చిరాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రసూతి వైద్యంలో అధునాత పద్ధతులు వస్తున్నాయని, వాటిపై ప్రతి ప్రసూతి పీజీకి అవగాహన ఉండాలని ఆయన అన్నారు.

ఆకట్టుకుంటున్న సాయిబాబా విగ్రహం

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మరో సాయిబాబా విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఊపిరి పీల్చుతూ వదుతున్నట్లు ఉన్న ఈ విగ్రహాన్ని రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తయారు చేశారు. దీన్ని ఆదివారం ఇక్కడి ఆలయంలో భక్తులు దర్శనం కోసం ఉంచారు. ఊపిరి పీల్చుతూ వదలడం, ఏడమ చేతి మధ్య వేలు కదపడం, నవ్వుతున్నట్టు ఉన్న ఈ సాయిబాబా విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. నాలుగు నెలల క్రితం కూడా రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మాట్లాడే షిరిడీ సాయిబాబా విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి కొద్ది రోజులు అనంతరం దాన్ని చింతపల్లికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నెల రోజుల పాటు ఇక్కడ సందర్శకుల దర్శనం కోసం ఉంచనున్నట్టు రవిచంద్ ఆర్ట్స్ నిర్వాహకుడు రవిచంద్ తెలిపారు. సుమారు ఐదున్నర అడుగుల ఎత్తు ఉండే ఈ విగ్రహాన్ని రూ.8 లక్షలు ఖర్చుతో మూడు నెలల పాటు శ్రమించి తయారు చేసినట్లు తెలిపారు.


చినగదిలి ఆలయంలో ఏర్పాటు చేసిన ఊపిరి పీల్చే సాయిబాబా విగ్రహం